క్లుప్తంగా

ఘనంగా గౌరీపరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం



గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని గణపర్తిలో గురువారం శ్రీగౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి గౌరీ పరమేశ్వరులను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ప్రసాదం స్వీకరించారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ నాయకులు చదరం అప్పలనాయుడు, చదరం రాము, తదితరులు గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు.

కొనసాగుతున్న అయ్యప్పస్వాముల భిక్ష



అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో భిక్ష చేస్తున్న భక్తులు

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న భిక్ష సదుపాయం గురువారానికి నాలుగో రోజుకు చేరుకుంది. భక్తుల విరాళాలతో ఈ నెల 13న భిక్ష సదుపాయాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. స్థానిక స్వాములతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అన్నసమారాధన స్వీకరిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం రేపు



వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

అచ్యుతాపురం: మండలంలోని కొండకర్లలో శనివారం ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం జరగనుంది. ఈ మేరకు వార్షికోత్సవం పోస్టర్‌ను ఎమ్మెల్యే సుందరపు తన క్యాంప్‌ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ



సరస్వతీదేవి అమ్మవారి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

ఎస్‌.రాయవరం: ధర్మవరం అగ్రహారం ఉన్నత పాఠశాలలో 2010–11 బ్యాచ్‌ 10వ తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసిన సర్వస్వతీ దేవి విగ్రహాన్ని గురువారం గ్రామ పెద్దలు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎం.ఎన్‌.ఎస్‌.ప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్‌ వెదుళ్ల బంగారి, సర్పంచ్‌ కలిగట్ల రత్నం, ఉప సర్పంచ్‌ మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

నూతన జీఎస్టీతో ఆర్థిక ఆదా



కోటవురట్లలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోటవురట్ల: నూతన జీఎస్టీ విధానంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని ఎంపీడీవో చంద్రశేఖర్‌ తెలిపారు. కోటవురట్లలోని దుకాణాలను సందర్శించి నూతన జీఎస్టీపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జీఎస్టీ విధానంతో అన్ని రకాల వస్తువులపై భారీగా తగ్గింపు వచ్చిందన్నారు. కొనుగోలు చేసే ప్రతి వస్తువు ఎంత తగ్గిందో అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రఘురాం, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయం.. సమస్యలమయం

తిమ్మాపురం కస్తూర్బా పాఠశాల



- పాఠశాల అభివృద్ధికి సహకరించని గ్రామ పెద్దలు
- చిన్నపాటి మైదానంలోనే విద్యార్థుల ఆటలు
- గ్రామస్తులు యథేచ్ఛగా చెత్త డంపింగ్



ప్రహరీ లేకపోవడంతో కేజీబీవీ ఆవరణలో చెత్త వేసిన గ్రామస్తులు

ఎస్‌.రాయవరం: తిమ్మాపురం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ) సమస్యలతో సతమతమవుతోంది. పాఠశాలలో బోధన బాగానే ఉన్నా, విద్యార్థులు క్రీడలకు మాత్రం పూర్తిగా దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలకు కేటాయించిన స్థలంలో ఆడుకుందామనుకున్నా స్థానిక కుర్రకారు చేష్టలు, సమీప నివాసదారులు చేస్తున్న ఆటంకాలు విద్యార్థులను ఇబ్బందుల పాలుజేస్తున్నాయి. గతంలో పాఠశాల సందర్శనకు వచ్చిన అధికారులకు, ఇటీవల వచ్చిన రాష్ట్ర హోంమంత్రి అనితకు విన్నవించుకున్నా ఫలితం లేకుండాపోయింది. కొరుప్రోలులో ఓ ప్రైవేటు భవనంలో నడిచే కేజీబీవీ పాఠశాలను తిమ్మాపురం గ్రామంలో 12 ఏళ్ల కిందట ఎకరంన్నర ప్రభుత్వ స్థలం నిర్మించిన భవనానికి మార్చారు. 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 200 మంది విద్యార్థినులు ప్రతి ఏటా విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే అప్పట్లో అధ్వానంగా ఖాళీగా ఉన్న స్థలాన్ని



ఇరుకు మైదానంలో ఖోఖో, వాలీబాల్‌ సాధన చేస్తున్న విద్యార్థినులు

అధికారుల సిఫార్స్‌ మేరకు పంచాయతీ తీర్మానం చేసి కేటాయించారు. ఆ వెంటనే విద్యాశాఖ నిధులు మంజూరు చేసి భవనాలు నిర్మాణం చేశారు. ఇప్పుడు గ్రామానికి ఆనుకుని ఉన్న స్థలాన్ని అనవసరంగా పాఠశాలకు కేటాయించారని, భవనాలు వరకు సరే, మిగిలిన స్థలాన్ని పాఠశాల విద్యార్థినులు ఉపయోగించకుండా గ్రామస్తులు అడ్డుపడుతున్నారు. పాఠశాల ప్రహరీ నిర్మాణాన్ని ఇప్పటికే పలు ధపాలు అడ్డుకున్నారు. క్రీడలకైతే పూర్తిగా అవకాశం లేకుండా చేస్తున్నారు. రెండేళ్లుగా ఈ పాఠశాలలో ఇంటర్మీడియెట్‌ బోధన ప్రారంభించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటర్‌ విద్యార్థులకు వసతి, తరగతి గదుల నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. భవనం నిర్మాణానికి గ్రామ పెద్దలు ఆటంకం తెలపడంతో ఆ నిధులు కూడా వెనక్కి మళ్లాయని పాఠశాల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. ఈ భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.29.58 లక్షలు గత ఏడాది ఆగస్టు 8న నిధులు విడుదలయ్యాయి. గ్రామ పెద్దలు అడ్డుపడుతుండడంతో పనులు ప్రారంభించలేదు. ఇంటర్‌ 60 మంది, 6 నుంచి 10 వరకు 200 మంది విద్యార్థినులు గత 13 ఏళ్లుగా క్రీడలకు దూరమయ్యారు. 2022లో అప్పటి ప్రభుత్వం పీఈటీ ఉపాధ్యాయులను కూడా నియమించినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా విద్యా శాఖ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మాణంతో పాటు సదుపాయాలు కల్పించాలని విద్యార్థినులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గ్రామ పెద్దలు సహకరించాలి



పాఠశాల కోసం కేటాయించిన స్థలంలో క్రీడలకు కోర్టులు ఏర్పాటు చేసుకోకుండా గ్రామ పెద్దలు, సమీప నివాసదారులు ఆటంకం కలిగిస్తున్నారు. ప్రహరీ లేక ఆటలు ఆడేందుకు బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఉన్నతాధికారులకు చెప్పాం. అయిన పరిష్కారం లేదు. స్కూల్‌ ఫెడరేషన్‌ క్రీడల కోసం ఉన్న కాస్త స్థలంలో శిక్షణ ఇస్తున్నాం. పాఠశాల అభివృద్ధికి గ్రామపెద్దలు సహకరించాలి.

– జి.లక్ష్మి, పీఈటీ, కేజీబీవీ, తిమ్మాపురం

ఆటలకు తప్పని అవస్థలు



రెండేళ్లుగా పాఠశాలలో చదువుతున్నా. ఆటలు ఆడుకునేందుకు సరైన సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నాం. ఉన్న స్థలంలో గ్రామస్తులు చెత్త వేస్తూ పాడు చేస్తున్నారు. బాలికలమని అని కూడా చూడడం లేదు. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

– కారే శ్రీదేవి, 7వ తరగతి

ప్రభుత్వ వైద్యం ప్రజల హక్కు

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం
- కోటి సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే కంబాల



కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుడుతున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, చిక్కాల

పాయకరావుపేట: ప్రభుత్వ వైద్యం ప్రజల హక్కు అని, అందుకే మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్‌ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు తెలిపారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలకు మండలంలోని సీతారాంపురంలో గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు వైఎస్సార్‌ సీపీ పాలనలో ప్రత్యేకమైన ముద్ర వేశారన్నారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్‌ కళాశాలను ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో మెడికల్‌ కళాశాలల నిర్మాణానికి కృషి చేశారన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు వైద్య రంగం అందుబాటులో ఉండాలని, మారుమూల గ్రామాలకు కూడా వైద్య సదుపాయం అందాలన్న లక్ష్యంతో వైఎస్‌ జగన్‌ ముందుకు సాగారన్నారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైద్య రంగాన్ని, మెడికల్‌ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడానికి కంకణం కట్టుకుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ వైద్య రంగాన్ని నీరుగారుస్తున్నారని విమర్శించారు. మెడికల్‌ కళాశాలల ప్రైవేటీకరణ పూర్తయితే పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్యం మరింత భారమవుతుందన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో సరైన వైద్య సదుపాయాల కోసం పోరాటం చేయాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. అనంతరం కోటి సంతకాలు సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మండల అధ్యక్షుడు గెడ్డమూరి శ్రీనివాసరావు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్‌, పార్టీ మండల ఉపాధ్యక్షులు రామాల శ్రీను, యజ్జల అన్నవరం, పార్టీ బీసీ సెల్‌ మండల అధ్యక్షులు పక్కుర్తి లోవకుమార్‌, పాయకరావుపేట ఉపసర్పంచ్‌ జగతా భవానీ శ్రీనివాస్‌, పీఏసీఎస్‌ మాజీ అధ్యక్షుడు దేవవరపు రాజేష్‌ ఖన్నా, పార్టీ నాయకుడు పక్కుర్తి మాధవరావు, మార్కెట్‌ కమిటీ మాజీ డైరెక్టర్‌ పెనుమత్స నాగేశ్వరరావు, ఎస్సీ సెల్‌ మండల అధ్యక్షుడు బోడపాటి గోవిందు, గోపాలపట్నం సర్పంచ్‌ పన్నీరు బాబ్జి పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ వేగవంతం కావాలి



ఉమ్మలాడలో కోటి సంతకాల సేకరణ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న క్లస్టర్‌ ఇన్‌చార్జి అప్పారావు



మామిడివాలో కోటి సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

మునగపాక: ప్రతి ఒక్కరూ గ్రామంలో కోటి సంతకాల సేకరణపై దృష్టి సారించాలని క్లస్టర్‌ ఇన్‌చార్జి, మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు కోరారు. బుధవారం రాత్రి మండలంలోని ఉమ్మలాడలో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణలో భాగంగా కార్యకర్తలతో క్లస్టర్‌ ఇన్‌చార్జిలు సమావేశమై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్‌ కళాశాలలను ప్రైవేటు పరం చేయాలని కుతంత్రాలు చేస్తుందన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మొల్లేటి శంకర్‌, మొల్లేటి వినోద్‌, మొల్లేటి అచ్చియ్యనాయుడు, మొల్లేటి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు. వెంకటాపురం గ్రామంలో కోటి సంతకాల సేకరణను పార్టీ మండల కన్వీనర్‌ ఆడారి అచ్చియ్యనాయుడు ప్రారంభించారు. సర్పంచ్‌ సుందరపు తాతాజీ, ఉప సర్పంచ్‌ సాయివజ్రం, పార్టీ నాయకులు బొడ్డేడ లిల్లీ, రేబాక బాబూరావు, దళాయి రామారావు, పండూరి నూకరాజు, కరణం రామకృష్ణ, సుందరపు అర్జునకుమార్‌, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

మామిడివాడలో కోటి సంతకాల సేకరణ

రాంబిల్లి(అచ్యుతాపురం): కూటమి ప్రభుత్వం మెడికల్‌ కళాశాలలను ప్రైవేట్‌ పరం చేసేందుకు పనుతున్న కుట్రను ఆపేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం రాంబిల్లి మండలం మామిడివాడ గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు మెడికల్‌ కళాశాలల పీపీపీ విధానం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మోటూరి రాఘవేంద్ర, వార్డు సభ్యులు బుసా చిరంజీవి, బొడ్డు చిన్నారి, పిల్లి కనకరాజు, కడితి రాజు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార యువత భవిత కోసం ప్రత్యేక శిక్షణ



మత్స్యకార సంక్షేమ సమితి సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీపన్‌

రాంబిల్లి(అచ్యుతాపురం): మత్స్యకార యువత ఉజ్వల భవిష్యత్‌ కోసం అవసరమైన అన్ని రకాల శిక్షణలు ఇప్పిస్తామని సీమ జాగరణ మంచ్‌ సహ సంచాలకుడు ప్రదీపన్‌ తెలిపారు. రాంబిల్లి మండల మత్స్యకార సంక్షేమ సమితి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రివిధ దళాలకు సంబంధించిన శిక్షణను మత్స్యకార యువత పూర్తి చేసి దేశ సరిహద్దుల్లో పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆకాంక్షించారు. మత్స్యకార యువతకు స్కిల్‌ డెవలప్‌మెంట్‌ శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి(ఎంఎస్‌ఎస్‌) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వాసు, రాష్ట్ర కార్యదర్శి గురునాథ్‌, రాష్ట్ర సంఘటన కార్యదర్శి రంగనాయకులు, జిల్లా గౌరవ అధ్యక్షుడు సూరాడ నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి పీహెచ్‌సీ సందర్శన



రాంబిల్లి పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో హైమావతి

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎం అండ్‌ హెచ్‌వో ఎం.హైమావతి గురువారం సందర్శించారు. ఆస్పత్రిలో సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఫీల్డ్‌ సిబ్బంది గ్రామ స్థాయిలో అభా ఐడీలు క్రియేట్‌ చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీలలో ప్రసవాలు ఎక్కువ జరిగేలా సిబ్బంది ప్రజల్లో అవగాహన కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సీసీ లక్ష్మీనారాయణ, వైద్యాధికారి రాజేశ్‌, పీహెచ్‌ఎన్‌ లయమ్మ, హెచ్‌వీ గనికమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారంతోనే ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శైలజ

పాయకరావుపేట: నాణ్యమైన ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ శైలజ కుర్రా అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా గురువారం సత్యవరం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో తాండవ ఎఫ్‌పీవో సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రకాల ఆహార పదార్థాలు సమతుల్యంగా తీసుకోవాలన్నారు. ధాన్యాలు, పప్పు గింజలు, నూనె గింజలతో పాటు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, అటవీ ఫలాలు కూడా సమతుల్యంగా తీసుకోవాలని గ్రామ సర్పంచ్‌ సఖిలేటి రాము సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఆదినారాయణ, ఉపాధ్యాయులు సత్యనారాయణ, తాండవ ప్రతినిధులు కృష్ణ, సూర్యనారాయణ, నూకరాజు, గ్రామ పెద్దలు నానాజీ, శాస్త్రవేత్తలు డాక్టర్‌ శివ, డాక్టర్‌ విజయరాజ్జి, నాగేంద్ర పాల్గొన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు సాదర స్వాగతం



దోసూరు హైస్కూల్‌లో కొత్త ఉపాధ్యాయులను ఆహ్వానిస్తున్న సహ ఉపాధ్యాయులు

అచ్యుతాపురం రూరల్‌: కొత్తగా నియామకమై మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన ఉపాధ్యాయులకు సహ ఉపాధ్యాయులు సాదరంగా స్వాగతం పలుకుతూ అభినందనలు తెలిపారు. గురువారం మండలంలో దోసూరు, మడుతూరు, అచ్యుతాపురం, పూడిమడక, ఎంజే పురం ఉన్నత పాఠశాలల్లో విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు సర్వీస్‌ రిజిస్టర్‌ పుస్తకంతో పాటు మొక్కలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.నాగేశ్వర్రావు, ఎంఎన్‌ మూర్తి, గౌరవ అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, సూరాడ అప్పలరాజు, శ్రీను, నాని, మోహిని, మణి, సన్యాసిరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్‌: ప్రతి రోజూ ఐదు నిమిషాలు ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందని యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ పి.చంద్రశేఖర్‌ అభిప్రాయపడ్డారు. గురువారం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్లు, ఏపీ ఇండియన్‌ రెడ్‌ క్రాస్‌ సొసైటీ యలమంచిలి శాఖ ఆధ్వర్యంలో ధ్యానంపై అవగాహన కల్పించే నిమిత్తం విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుందని పరిశోధనల్లో తేలిందన్నారు. అంతేకాకుండా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ఆఫీసర్లు చిట్టిబాబు, అర్జున అప్పారావు, రెడ్‌క్రాస్‌ సొసైటీ విద్యార్థులు టి.దుర్గాప్రసాద్‌, ముత్తుస్వామి, హరీష్‌, సాయికుమార్‌, అక్షయకుమార్‌ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

మాకవరపాలెం: కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్‌ఎంఎంఎస్‌ స్కాలర్‌షిప్‌ అర్హత పరీక్షకు దరఖాస్తు గడువును పెంచినట్టు ఎంఈవో మూర్తి గురువారం తెలిపారు. మొదట దరఖాస్తులు చేసేందుకు ఈ నెల 14 వరకు సమయం ఇచ్చారని, మరలా గడువును ఈ నెల 25 వరకు పెంచినట్టు తెలిపారు. పూర్తి వివరాలకు 8వ తరగతి విద్యార్థులు ఆయా ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

ఎస్‌.రాయవరం: కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి మండల స్థాయి స్కూల్‌ ఫెడరేషన్‌ గేమ్స్‌ నిర్వహించనున్నట్టు ప్రధానోపాధ్యాయుడు కె.ప్రసాద్‌ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి గ్రామాల వారీగా వచ్చిన క్రీడాకారులతో ఆటలు ఆడించి ఎంపికలు చేస్తామన్నారు. మండల స్థాయిలో సెలక్ట్‌ అయిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో ఆడతారన్నారు. ఆ తరువాత జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు క్రీడలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులు సమయానికి అర్ధ గంట ముందుగా చేరుకుని వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

అర్జీలకు త్వరగా పరిష్కారం చూపాలి

మునగపాక: ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని తహసీల్దార్‌ పి.సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం సాయంత్రం వీఆర్వోలు, సర్వేయర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీకి సమాధానం ఇవ్వాల్సిందేనన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రీ–సర్వే పనులు కూడా వేగవంతం చేయాలని సూచించారు. డీటీ మురళీధర్‌, ఆర్‌ఐ కృష్ణవేణి, మండల సర్వేయర్‌ రవీంద్రపాల్‌, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రేపు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం రూరల్‌: మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్‌ ఆపరేషన్స్‌ ఈఈ కె.రాజశేఖర్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండకర్ల కూడలి, యర్రవరం, ఉప్పవరం, మళ్లవరం, నరేంద్రపురం, ఎంజేపురం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

హడలెత్తిస్తున్న కుక్కలు



కోటవురట్ల మెయిన్‌రోడ్డులో కుక్కలు

కోటవురట్ల: గ్రామ సింహాలు హడలెత్తిస్తున్నాయి. గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు పిక్కలు పట్టి లాగుతాయేమోనన్న భయంతో వాహనదారులు తారెత్తిపోతున్నారు. రహదారుల్లో ఎక్కడికక్కడ గుంపులుగా తిరుగుతున్న కుక్కలతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కుక్కలు వెంటపడితే ఆగినా, వేగంగా వెళ్లినా కాటు మాత్రం తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం కోటవురట్లలో కుక్కల బెడద ఎక్కువైంది. ఒకేసారి పదికి తక్కువ కాకుండా కుక్కలు రోడ్లపై తిరుగుతున్నాయి. వీటిని తప్పించుకునే క్రమంలో వాహనచోదకులు కింద పడి తీవ్రంగా గాయపడుతున్నారు. తప్పించుకోలేని వారు కాటుకు గురై యాంటీ రేబిస్‌ ఇంజక్షన్‌ చేయించుకుంటున్నారు. ఒక్కొక్క చోట వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనాలకు కుక్కలు అడ్డుపడి పలువురు తీవ్రంగా గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇటీవల కాలంలో కుక్కకాటుతో పలువురు మృతి చెందిన సంఘటనలు చోటు చేసుకోవడంతో భయాందోళన చెందుతున్నారు. కుక్కల బెడద లేకుండా చేయాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

బాంబు బ్లాస్టింగ్‌లు నిలిపివేయాలి



మాట్లాడుతున్న దగ్గుపల్లి సాయిబాబా

పాయకరావుపేట: పోలవరం కాలువ నిర్మాణంలో భాగంగా పట్టణ పరిధిలో నివాస ప్రాంతాల వద్ద చేపడుతున్న బాంబు బ్లాస్టింగ్‌లను నిలిపివేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా డిమాండ్‌ చేశారు. తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పోలవరం కాలువ నిర్మాణం అందరికీ సమ్మతమేనని, కానీ కొండపై ఉన్న బండరాళ్లను బాంబులు పెట్టి పేల్చడంతో కొండ దిగువున గల నివాస ప్రాంతాలపై పడుతున్నాయన్నారు. బాధితులు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇంటి గోడలు బీటలు వారేలా బ్లాస్టింగ్‌లు చేయడంతో ప్రజలకు నిద్ర పట్టడంలేదన్నారు. రాళ్లు ఎగిరిపడి గాయాలపాలైన వ్యక్తులకు, పైకప్పులు శిథిలమైన ఇళ్లకు న్యాయం చేయాలని, లేకుంటే ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.


క్వాంటమ్‌ సైన్స్‌తోనే ప్రపంచ పురోగతి



గెలుపొందిన విద్యార్థులతో ఎంఈవోలు, ఉపాధ్యాయులు

మాకవరపాలెం: ప్రపంచ పురోగతి క్వాంటమ్‌ సైన్స్‌తోనే సాధ్యమని ఎంఈవోలు అచ్యుతరావు, మూర్తి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్‌ సెమినార్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా క్వాంటమ్‌ ఏజ్‌ బిగెన్స్‌, పొటన్షియాలిటీస్‌ అండ్‌ చాలెంజెస్‌ అనే అంశంపై విద్యార్థులు చార్ట్స్‌, డిజిటల్‌ ఎక్విప్‌మెంట్‌తో ప్రజెంటేషన్‌ ఇచ్చారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎంఈవోలు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ టెక్నాలజీపై ఆధారపడి ఉంటుందన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు జిల్లాస్థాయి సెమినార్‌లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన భూములకు రక్షణ కల్పించాలి



తహసీల్దార్‌ కార్యాలయానికి ర్యాలీగా వెళుతున్న ఆందోళన కారులు

జోలుగుంట: భూములకు రక్షణ కల్పించి, సాగులో ఉన్న గిరిజనులకు పట్టాలివ్వాలని డిమాండ్‌ చేస్తూ గురువారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మరియూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ రోడ్డులో ర్యాలీ చేశారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయకార్యదర్శి కె.గోవిందరావు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా అర్ల, పీత్రుగెడ్డ ,లోసింగి, పెదగరువు, ఎం.పెదపేట, పనసలపాడు, గంగవరం గ్రామానికి చెందిన 96 కుటుంబాల వారు అటవీ భూమిలో జీడి మామిడి, అపరాలు సాగు చేసుకొని జీవనోపాధి సాగిస్తున్నారని, సాగులో ఉన్నా పట్టాలు మాత్రం ఇవ్వలేదని తెలిపారు. ప్రత్యేక డీఎల్‌సీ కమిటీ ఏర్పాటు చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండు చేశారు. ఈ గ్రామాలకు రేషన్‌ పాయింటు ఏర్పాటు చేయాలని, విద్యుత్‌ లేని గ్రామాలకు విద్యుత్‌ సౌకర్యం కల్పించాలని కోరారు.